# ప్రశ్నలు & సమాధానాలు
# ప్రశ్న 323: అంతిమ లక్ష్యంకే గురి పెట్టు
# జూన్ 8, 2024

ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 1, పేజీలు 167-173 నుండి తీసికొనబడినవి

స్వామి! మీరు అనుభవ జ్ఞానం గురించి చెప్పారు. మాకు చాలా విషయాలే తెలుసని మేము భావిస్తున్నాము. ఇది జ్ఞానం కాదా?

భగవాన్: కాదు, కాదు.  సమస్య ఏమంటే మీకు తెలియదని మీకు తెలియదు. మీకు ఉన్న జ్ఞానం చాలా కొంచెం, అకించిత్కరమైనది. కానీ మీకు అన్నీ తెలుసనుకుంటారు. మీరు చదువుకున్నది చాలా కొంచెం. దాంతో అంతా తెలుసనీ మీరనుకుంటే అది పొరపాటు. వెర్రితనం కూడా. తెలుసుకోవలసినది చాలా ఉంది. మీకు తెలిసినది ఒక చిన్న భాగము. సంపూర్ణ జ్ఞానం కాదు.

ఇది చూడండి, ఒక కర్చీఫ్. (ఇక్కడ స్వామి కర్చీఫుని గుప్పెట్లో పట్టుకొని, ఒక చిన్న కొన మాత్రమే కనబడే లాగ పట్టుకున్నారు). ఇప్పుడు ఇదేంటి? ఒక చిన్న గుడ్డ ముక్క మాత్రమే. మొత్తం కర్చీఫ్ కాదు. (ఇక్కడ స్వామి కర్చీఫుని విప్పారు). ఇప్పుడు ఇదేంటి? మీరు దీనిని కర్చీఫ్ అంటారు. కొంచెం ముక్క మాత్రమే చూస్తే దానిని కర్చీఫ్ అనలేరు. అదే విధంగా, కొంచెం జ్ఞానం సంపాదంచి అది సంపూర్ణ జ్ఞానం అనుకోడానికి లేదు. ఇదే ఈనాటి విద్యావంతులు చేసే పొరపాటు. కొంచెం తెలుసుకొని అంతా తెలుసని అంటారు. సంపూర్ణ జ్ఞానం అంటే చిత్, ఒక చిన్న ముక్కో, భాగమో కాదు. అదే మీరు గుర్తు పెట్టుకోవలసింది. సంపూర్ణ జ్ఞానం పైన గురి పెట్టుకోవాలి.

స్వామి! భక్తునికి సంపూర్ణ అనుభవం ఎలా లభిస్తుంది?

భగవాన్: ముక్తిలోనే భక్తి నెరవేరుతుంది. అంతవరకూ భక్తునికి సంపూర్ణ అనుభవం ఉందని చెప్పలేము. పూర్ణానుభావమే అద్వైతానందం, బ్రహ్మానందం, నిత్యానందం. ఒక చిన్న ఉదాహరణ. నది ఎప్పుడూ పారుతూనే ఉంటుంది. దారిలో ఎన్నో అడ్డాలు వస్తుంటాయి. కానీ రకరకాల మలుపులు తిరుక్కుంటూ ఆ నది పారుతూనే ఉంటుంది. అడ్డాలన్నిటినీ దాటుకొని ముందుకు వెళ్తుంది. ఎంత దూరం వెళ్తుంది? సముద్రంలో వెళ్ళి కలిసేంత వరకు పోతుంది. కానీ ఆ సముద్రం వెంటనే కలవనివ్వదు. నదిని వెనక్కి నెట్టి వేస్తుంది. కానీ నది తన ప్రయత్నాలను మానదు. చివరికి సముద్రపోటు వచ్చినప్పుడు వెళ్ళి కలుస్తుంది. ఆ లయము, సాయుజ్యము జరిగినప్పుడే నదికి విశ్రాంతి, ప్రశాంతి దొరుకుతుంది.

భక్తునికి, భగవంతునికి ఉన్న బంధం కూడా అటువంటిదే. పారే భక్తి భగవంతునిలో లయము అవడానికి చేసేదే సాధన. నది సముద్రంలో ఎలా కలిసిపోతుందో అదే విధంగా జీవుడు బ్రహ్మలో ఐక్యమైపోతాడు. అదే జీవ-బ్రహ్మైక్యత, జీవాత్మ పరమాత్మల యొక్క సంయోగం.

స్వామి! విజ్ఞానం అంటే ఏంటి?

భగవాన్: విజ్ఞానం అంటే పుస్తకాల్లో చదువుకొనేది కాదు. విజ్ఞానం అంటే పాండిత్యం కాదు. విజ్ఞానం అంటే బోధన కాదు. విజ్ఞానం నోటితో ఉచ్చరించేది కాదు. విజ్ఞానం అంటే ఏ డిగ్రీనో, PhDనో సంపాదించడం కాదు. విజ్ఞానం అంటే అనుభవ జ్ఞానం. విజ్ఞానాన్ని తలలోకి దూర్చలేము. విజ్ఞానంతోనే మన తప్పులు, దోషాలు, లోపాలను గుర్తించి, సరి దిద్దుకొని, ఆ తప్పులను మళ్ళీ చేయకుండా జాగ్రత్త పడగలం.

స్వామి! ఈ పెద్ద దేహంలో ప్రాణం ఎక్కడ ఉంటుంది?

భగవాన్: మీరు హృదయంలో ఉంటుందని అనుకుంటారు. కాదు. ఈనాటి సర్జన్ లు గుండె మార్పిడి కూడా చేస్తున్నారు కదా? అది చేస్తుండగా కూడా రోగి చనిపోవడం లేదు. అంటే అతను బ్రతికి ఉండడానికి ప్రాణం ఎక్కడుంది? వెన్నెముకలో 9, 12 వెన్నుపూసల మధ్య ఈ ప్రాణం ఒక స్విచ్ మాదిరి పని చేస్తుంది.

మంత్రంపుష్పంలో స్పష్టంగా చెప్పారు, విద్యుల్లేఖేవ భాస్వరా, అంటే విద్యుత్తు ప్రాణం వలె ప్రవర్తిస్తుంది.

స్వామి! జీవితానికి ముఖ్యమైన సూత్రాలు ఏంటి?

భగవాన్: పుట్టినపుడు బిడ్డ ఏడుస్తాడు కానీ పోయేటప్పుడు మనిషి నవ్వుతూ పోవాలి. బిడ్డ ఎందుకు ఏడుస్తాడో తెలుసా? ముందుండే దౌర్భాగ్యం, దుఃఖాలు, కష్టాల గురించి ఏడుస్తాడు. ఆదిశంకరుల వారు చెప్పారు, పునరపి జననం పునరపి మరణం, పునరపి జననీ జఠరే శయనం.

ప్రతి ఒక్కరూ జన్మ జన్మకి మళ్ళీ మళ్ళీ పుడతారు. అందుకనే బిడ్డ ఏడుస్తాడు. కానీ వాడు పుట్టినప్పుడు తల్లితండ్రులు, పెద్దలు, చుట్టాలు అందరూ పండుగ చేసుకొని, మిఠాయిలు పంచిపెట్టుకుంటారు. జీవితమనేది కోహం, ఎవరు నేను, అనే ప్రశ్నతో మొదలౌతుంది. జీవితం అంతమయ్యే లోపు సోహం, అతడే నేను, నేనే ఆ పరమాత్మ, అనే సమాధానం రావాలి. సాధన ద్వారా ఆ సమాధానం వస్తుంది. క్వస్చిన్ పేపరు మళ్ళీ మళ్ళీ చదివినంత మాత్రాన ప్రయోజనం లేదు.

జీవితాన్ని ప్రొద్దున, మధ్యాన్నం, ర్రాత్రి అని మూడు దశలగా భావించవచ్చు. ప్రొద్దున బిడ్డ కాళ్ళూ చేతులూ ఉపయోగించి నేలపై పాకే దశ. మధ్యాన్నం యుక్త వయసులో రెండు కాళ్ళపై నడిచే దశ. రాత్రి ముసలితనంలో మూడు కాళ్ళతో నడిచే దశ, అంటే కాళ్ళ బలహీనత వల్ల కర్రతో నడుస్తాడు.

బ్రహ్మచర్యం అనే పునాది పైన మూడు అంతస్థుల భవనం కడితే, మొదటి అంతస్థు గృహస్థ్య ఆశ్రమం, రెండవ అంతస్థు వానప్రస్థ ఆశ్రమం, మూడవ అంతస్థు సన్యాసం. కనుక ఈ భవనానికి బ్రహ్మచర్యమే ఆధారం. మానవునికి 50 ఏళ్ల వయసు వచ్చేడప్పటికి అయిదు కర్మేంద్రియముల పైన పూర్తి వశం ఉండాలి. 60 ఏళ్ల వయసు వచ్చేడప్పటికి కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలను వశం చేసుకోవాలి.

70 ఏళ్ల వయసుకి ఈ బలహీనతలను అన్నిటినీ అధిగమిస్తే అతనిని సప్తఋషులలో ఒకరుగా, సప్తస్వరాలలో ఒకటిగా, సప్తసముద్రాలలో ఒకటిగా గౌరవిస్తారు. 80 ఏళ్ల వయసుకి అష్టాంగ యోగమును సాధన చేసి అష్టదిక్పాలకుల వలె ప్రకాశిస్తాడు. 90 ఏళ్లకి నవవిధ భక్తి మార్గములను పాటించి అతని జీవితము నవరత్నముల వలె ధగధగ మెరిసిపోతుంది. 100 ఏళ్ళకి జ్ఞానేంద్రియములను, కర్మేంద్రియములన్నిటినీ జయించి బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి, అంటే దివ్యత్వమును అనుభవిస్తాడు.

మీరు ఇంకొక విషయం కూడా గుర్తించాలి. మీరు ఏది చేసినా మీ సంతృప్తి కొరకు చేయాలి కానీ పరుల కొరకు కాదు. మీ ఆత్మ సంతృప్తి ముఖ్యము. మీరు కొత్త బట్టలు ధరిస్తే ఎవరి కొరకు ధరిస్తారు? మీ తృప్తి కొరకే. మీరు కొత్త ఇల్లు కట్టుకుంటే ఎవరి కొరకు? మీ కొరకే కదా? మీరు ఒక ఆపిల్ పండుని తింటే అది మీ కొరకే కదా తింటారు, ఆపిల్ కొరకు కాదు కదా? మీ తృప్తి కొరకు.

ఆత్మ భగవంతునితో సమానం. జీవితమనే నాటకంలో మీ పాత్ర బాగా నటించాలి. స్వామి సూత్రధారి, మీరు పాత్రధారి. ఇది ఒక మంచి అవకాశం అని గుర్తించండి. జీవితమును ఆదర్శవంతంగా జీవించి సంఘంలో మంచి పేరు తెచ్చుకోండి. భగవంతుడే మిమ్మల్ని మెచ్చుకోవాలి. గీతలో చెప్తాడు, మన్మనా భవ మద్భక్తో మధ్యాజీ మాం నమస్కురు. మీ కోరికలు తీరాలని ప్రార్థించకండి. భగవంతునితోనే ఉండాలని కోరుకోండి. అప్పుడు మిగతావి అన్నీ చేకూరుతాయి. ఎప్పుడూ వినయ విధేయతలు కలిగి ఉండండి.

దక్షిణ భారతదేశంలో భోజనాన్ని అరిటాకులలో వడ్డిస్తారు. పదార్థాలు అన్నీ వడ్డించిన తర్వాత ఆకు ఎగిరిపోకుండా నిలుస్తుంది. ఏమి వడ్డించక ముందు గాలికి ఎగిరిపోతుంది. అంటే ఖాళీ గిన్నెలు మోత ఎక్కువ చేస్తాయి. నిండా పండ్లు ఉన్న చెట్టు వంగి ఉంటుంది. అదే విధంగా నిజమైన విద్వాంసుడు వినయంగా ఉంటాడు. వాయు మేఘాలు పైకి తేలిపోతాయి కానీ వర్ష మేఘాలు కిందికి దిగుతాయి. అహం ఉన్న మనిషి నాశనం అయిపోతాడు.

జీవితంలో పాటించాల్సిన సూత్రములు నాలుగు ఉన్నాయి. మొదటిది, త్యజ దుర్జన సంసర్గం. దుర్మార్గ సహవాసం నుండి దూరంగా పారిపోండి. రెండవది భజ సాధు సమాగమం. సన్మార్గ సహవాసం చేయండి. దుర్మార్గ సహవాసానికి దూరం అవడానికి అవసరం అయితే డబ్బులు పోగొట్టుకోండి కానీ సన్మార్గ సహవాసమును దూరం చేసుకోకండి.

మూడవ సూత్రం నిత్యమనిత్యం. అనిత్యమైనది ఏదో గ్రహించండి. నిత్యమైన దివ్యత్వాన్ని గుర్తించండి. మీకు వివేకం అనే ప్రసాదం లభించినది. దానిని ఉపయోగించి ఏది అనిత్యం, అశాస్వతం, అనేకత్వమో, ఏది సత్యనిత్యం, ఏకత్వమో గుర్తించండి.

నాలుగవది కురు పుణ్యం అహోరాత్రం. పగలు, రాత్రి పుణ్య కార్యాలు చేయండి. పరోపకారాయ ఇదం శరీరం. ఈ దేహం పరులకు ఉపయోగ పడడానికి ఇవ్వబడింది.

ప్రొ అనిల్ కుమార్ గారు వచ్చే వారం మరిన్ని ఐశ్వర్య నిధులతో మీ ముందుకు వస్తారు. ధన్యవాదములు.

ఓం సాయి రామ్!